ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 30.0 । కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY

5



మహబూబ్‌నగర్

జిల్లా వార్తలు

శనివారం 29 జూన్ 2024

వర్షం కోసం..

ఎదురు చూస్తున్న రైతులు



ఎదిరలో ఎండిపోతున్న జొన్న పంట

- మూడు వారాలుగా జాడలేని వాన
- ఎండుతున్న మొలకలు
- పాలమూరులో 74,905 ఎకరాల్లో వివిధ పంటల సాగు

పాలమూరు, జూన్ 28: ఈ వానాకాలంలో జూన్ మొదటి వారంలోనే కురిసిన వర్షాలు ఆ తర్వాత ముఖం చాటేశాయి. సీజన్ ప్రారంభమై 24 రోజులు అయినా వానలు పడకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మొదట్లో కురిసిన వర్షానికి పలువురు రైతులు విత్తనాలు వేశారు. ఆ తర్వాత వానలు రాక, పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో మొలకలు ఎండిపోతున్నాయి. విత్తనాలు వేయని వారు అదును దాటిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ వానాకాలంలో 3,23,533 ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేయనున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అందులో అక్కడక్కడా కురిసిన వర్షాలకు 40 శాతం మేర అంటే 74,905 ఎకరాల్లో విత్తనాలు వేసినట్లు అధికారులు చెబుతున్నారు. అత్యధికంగా పత్తి 49,266 ఎకరాల్లో సాగు చేయగా, పెసర్లు అత్యల్పంగా మూడు ఎకరాల్లో సాగు చేశారు.

వాడుతున్న మొలకలు

వానాకాలం ప్రారంభమయ్యే జూన్ మొదటివారంలో అడపాదడపా వానలు పడటంతో పలువురు రైతులు విత్తనాలు వేశారు. ఆ తర్వాత 24 రోజులుగా వానలు కురవ లేదు. మృగశిర కార్తె వచ్చి 18 రోజులు గడిచినా వానలు లేక పోవడంతో మొలకెత్తిన విత్తనాలు వాడిపోతున్నాయని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో అకాల వర్షాలు కురియడంతో రైతులు ముందుగానే దుక్కులు సిద్ధం చేసుకున్నారు. తొలకరి వానలు పడగానే విత్తనాలు వేశారు. ఆ తర్వాత వరుణుడు ముఖం చాటేయడంతో రైతుల ఆశలు అడియాశలయ్యాయి.

జిల్లాలో సాగైన పంటల వివరాలు(ఎకరాల్లో)

పంటలు	సాగు అంచనా	సాగయ్యింది
వరి	1,70,445	80
జొన్న	11,312	3,298
మొక్కజొన్న	33,894	9,217
పెసలు	174	3
కందులు	18,229	7,926
పత్తి	85,379	49,266
రాగులు	1079	15
చెరకు	60	-
వేరుశనగ	45	7
ఆముదం	921	78
ఇతర పంటలు	1950	5,015
ఉద్యాన పంటలు	16,521	-

అధిక ధరలు పెట్టి పేరున్న కంపెనీల విత్తనాలు కొన్నామని, అవి భూమిలోనే మురిగిపోతే మళ్లీ కొని వేయాల్సి వస్తుందని వాపోతున్నారు. అదే జరిగితే పెసర, కంది, మొక్కజొన్న పంటల సాగు ఆలస్యమౌతుందని అంటున్నారు. ఇంకో వారం రోజుల్లో వానలు కురవకతో పంటలు చేతికందే పరిస్థితి ఉండదని చెబుతున్నారు.

జూన్‌లో 83.1 మిల్లీ మీటర్ల వాన

జిల్లా జూన్ సాధారణ వర్షపాతం 65.9 మిల్లీ మీటర్లు కాగా.. 83.1 మిల్లీ మీటర్లు కురిసింది. తొమ్మిది మండలాల్లో ఎక్కువగా, ఐదు మండలాల్లో మధ్యస్థంగా, రెండు మండలాల్లో 20 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఒక్క జడ్చర్ల మండలంలోనే తక్కువ వాన పడింది. అయితే విత్తనాలు వేశాక వానలు కురవకపోవడంతో జూన్‌లో అధిక వర్షపాతం నమోదైనా ఉపయోగం లేకుండా పోయింది.



వానకోసం ఎదురు చూస్తున్నం

ఎకరా పొలంలో కందులు వేశా. ఎనిమిది వేల రూపాయలకుపైగా పెట్టుబడి పెట్టిన. 20 రోజుల నుంచి వాన లేదు. ఇంకో వారం రోజుల్లో వాన పంట చేతికి రాదు. పెట్టబడి మట్టిపాలైతది.

- గొడుగు మొగులయ్య, బూరెడ్డిపల్లి, జడ్చర్ల



రూ.30 వేలు పెట్టుబడి పెట్టిన

తొలకరి వానకు ఐదు ఎకరాల్లో జొన్నలు, కందులు వేసినం. మొలకలు ఎదుగుతున్నాయి. ఇప్పుడు వాన వస్తేనే విత్తనాలు ఎదుగుతాయి. కానీ వానలేక వాడిపోతున్నాయి. విత్తనాలు వేసేందుకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టిన.వానరాకుంటే.. దున్ని మళ్లీ విత్తనాలు వేయాలి.

- నరసింహులు, అప్పన్నపల్లి, మహబూబ్‌నగర్



60 మి.మీ. వర్షం పడినప్పుడే విత్తుకోవాలి

జిల్లాలో 60 మిల్లీ మీటర్ల వర్షం పడినప్పుడే ఆరుతడి పంటలు వేసుకోవాలి. తేలికపాటి నేలలైతే 50-60 మిల్లీ మీటర్లు, బరువు నేలలైతే 60-75 మిల్లీ మీటర్ల వర్షం పడితే విత్తనాలు వేయాలి. ఈ నెల చివరి నాటికి మంచి వర్షం పడితేనే విత్తనాలు వేసుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుంది. వర్షాధార పంటలైన కంది, పెసర, జొన్న, మొక్కజొన్న పంటలకు వేయాలంటే నాగలి సాలు వచ్చేంత తడి ఉండాలి. వరి, దీర్ఘకాలిక, మధ్యకాలిక రకాలను ఆగస్టు వరకు నాటుకోవచ్చు.

- బి.వెంకటేష్, జిల్లా వ్యవసాయ అధికారి



సఫారీ టూర్‌కు వెళ్లే ఫర్హాబాద్ ముఖద్వారం



- వన్యప్రాణులకు సంతానోత్పత్తి సమయం
- జూలై 1 నుంచి సెప్టెంబరు 30 వరకు అమ్రాబాద్ టైగర్ సఫారీ మూసివేత



పెద్ద పులికి.. సిగ్గెక్కువ

నల్లమల అమ్రాబాద్ అభయారణ్యం



సఫారీ టూర్ వాహనాలు(ఫైల్)

మన్ననూర్, జూన్ 28: పెద్ద పులికి సిగ్గెక్కువ. జనసంచారంతో కూడిన అలజడి కలిగినా, వాహనాల శబ్దం వినబడినా కొన్ని కిలో మీటర్ల దూరం వెళ్లిపోతుంది. పులులతో పాటు చిరుతలు, ఇతర అడవి జంతువులు సంతానోత్పత్తి కోసం ఇది కలుసుకునే సమయం. ఈ సమయంలో వాటి ఏకాంతానికి భంగం కలుగకుండా అటవీ శాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా జూలై ఒకటి నుంచి సెప్టెంబరు 30 వరకు అమ్రాబాద్ టైగర్ సఫారీ ప్యాకేజీని నిలిపేసింది. అక్టోబరు ఒకటి నుంచి జూన్ 30 వరకు మాత్రమే ప్యాకేజీలో అందుబాటులో ఉంటుంది. వర్షాకాలంలో చెట్లు దట్టంగా పెరిగి ఉండే వాతావరణంలో వన్యప్రాణులు జతకట్టడానికి ఇష్టపడతాయి. అందుకే పెద్ద పులులతో పాటు.. చిరుతలు, జింకలు, మనుబోతులు, సాం బార్లు, నీల్ గాయ్, ఎలుగుబంట్లు, తదితర జంతువుల సంఖ్య గణనీయంగా పెరగాల్సిన అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని నల్లమల అభయారణ్యంలోకి మనుషులు వెళ్లకుండా జూలై నుంచి అక్టోబరు వరకు అనుమతులు నిలిపేస్తారు. ఎవరైనా అడవిలోకి వెళ్తే వైల్డ్ లైఫ్ చట్టం ప్రకారం శిక్షార్హులు అవుతారు. నల్లమల మొత్తం అణువణువునా సీసీ కెమెరాల పర్యవేక్షణలో అటవీ అధికారులు రక్షణ చర్యలు చేపడుతున్నారు.

పెంపుదలకు చర్యలు

అమ్రాబాద్ పులుల అభయారణ్యా ప్రాంతం 2,611 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో ఉంది. అడవిలో ప్రస్తుతం 30 పెద్ద పులులు, 170 చిరుతలు, 2000లకు పైగా ఇతర వన్యప్రాణులు ఉన్నట్లు అటవీ శాఖ నివేదికలు చెబుతున్నాయి. దేశంలోనే రెండో అతి పెద్దదైన అమ్రాబాద్ అడవులు పులులకు అత్యంత సురక్షిత ప్రాంతంగా మారాయని ఈ మధ్య కాలంలో పులుల సంఖ్య పెరగడాన్ని బట్టి తెలుస్తోంది. అయితే జూలై నుంచి అక్టోబరు వరకు అడవిలోకి పర్యాటకులను గానీ, ఇతరులను గానీ అనుమతిస్తే వారి వలన కలిగే అలికిడి, వాహనాల శబ్దం వలన పులులు, ఇతర జంతువుల ఏకాంతానికి భంగం కల్గుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ అడవి గుండా ఉన్న శ్రీశైలం హైదరాబాద్ రహదారిలో రోజూ రాత్రి తొమ్మిది గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు వాహనాలను అనుమతించకుండా అటవీ శాఖ చర్యలు చేపడుతోంది. పోడు వ్యవసాయం సైతం చాలా తక్కువగానే ఉండటంతో స్థానికుల నుంచి అడవి జంతువులకు అంతరాయం చాలా తక్కువగానే ఉంటుందని చెబుతున్నారు. ప్రజలకు ఎలాంటి వసతులు లేని సార్లపల్లి, కుడింతలబైలు, వటవర్లపల్లి, కొల్లంపెంట వంటి అడవి మధ్యలో ఉన్న ఊర్లను మైదాన ప్రాంతాలకు తరలించాలని అటవీశాఖ యోచిస్తోంది. ప్రజలు అడవులను వీడితే చెట్లను పెంచి, పెద్దపులులు ఇతర అడవి జంతువులకు మరింత స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించే దిశగా చర్యలు చేపడుతోంది.



మూడు నెలలు సహకరించాలి

నల్లమల సందర్శనకు వచ్చే పర్యాటకులు జూలై ఒకటి నుంచి సెప్టెంబరు 30 వరకు టైగర్ సఫారీ టూర్‌ను వాయిదా వేసుకోవాలి. వణ్యప్రాణుల సంతానోత్పత్తి దృష్ట్యా ఈ సమయంలో సఫారీ టూర్‌ను రద్దు చేస్తున్నాం. ఈ మూడు నెలలు శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై వాహనాల వేగం 30కి మించరాదు. వన్యప్రాణుల స్వేచ్ఛకు ఎవరూ భంగం కల్గించరాదు. వన్యప్రాణులు ఉంటేనే పర్యావరణ, అటవీ సంపద, పరిరక్షణ సాధ్యపడుతుంది.

- రోహిత్ గోపిడి, డీఎఫ్‌వో

ఇద్దరు మహిళలు అదృశ్యం

తాడూరు, జూన్ 28 : నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఇద్దరు వివాహితలు అదృశ్యమయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం యాదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మమ్మ(35) ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబంలో చిన్న గొడవ జరగడంతో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. భర్త జంగయ్య వెతకగా ఆచూకీ లభించ లేదు. దాంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

హన్మసానిపల్లి గ్రామంలో..

నవాబ్‌పేట: మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం హన్మసానిపల్లి గ్రామానికి చెందిన వివాహిత నిర్మలమ్మ(30) అదృశ్యమైంది. భర్త మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మలమ్మ కారుకొండకు చెందిన ఓ వ్యక్తితో తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండేది. ఈనెల 26న తెల్లవారుజామున లేచి చూడగా కనిపించ లేదు. ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.





సీతాకోక చిలుకల దండు

వనపర్తి మండలం శ్రీనివాసపురం నర్సరీ వద్ద సీతాకోక చిలుకలు సందడి చేశాయి. పూర్తి ఆకుపచ్చ రంగులో ఉన్న అవి చూపరులను ఆకట్టుకున్నాయి. ఒక్కటి మాత్రమే ఆకుపచ్చ, నలుపు రంగులో ఉన్నది. ఆ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం కెమెరాలో బంధించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి

పాలమూరు నిర్మాణంలో.. బీఆర్ఎస్ విఫలం



పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు అధికారులతో పనులపై ఆరా తీస్తున్న మంత్రి జూపల్లి; చిత్రంలో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

- అడ్డగోలుగా రూ.కోట్లు ఖర్చు
- పదేళ్లలో వంద మీటర్లు కూడా నీరు పారించలేదు
- చేపట్టిన 25 శాతం పనులూ అసంపూర్తి
- ఇంకా రూ.70 వేల కోట్లు అవసరం
- మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, జూన్ 28: పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అడ్డగోలుగా కోట్ల రూపాయలు ఖర్చు చేసి పదేళ్ల పరిపాలనలో కనీసం వంద మీటర్ల దూరం కూడా సాగునీరు పారించలేదని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్, ప్రాజెక్టు సీఈ విజయ్ భాస్కర్‌తో కలిసి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పరిశీలించారు. నిర్మాణంలో టన్నెల్, సర్జిపుల్, పంపుహౌస్, ప్యానెల్ బోర్డు, జీరో పాయింట్లను పరిలించారు. జరిగిన, జరుగుతున్న పనుల గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. అదేవిధంగా మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం పంపుహౌజ్, సర్జిపూల్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ముందు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదరాబాదరాగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ఒక పంపును ప్రారంభించారన్నారు. రెండు రోజుల పాటు నీటిని విడుదల చేసి, పనులు పూర్తయ్యాయని చేతులు దులుపుకునే ప్రయత్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెయిన్ కెనాల్ పనులు అసంపూర్తిగా ఉన్నాయని, సబ్ కెనాల్ పనులు ఇంకా మంజూరు కాలేదని చెప్పారు. దానికి సంబంధించిన భూసేకరణ కూడా పూర్తి కాలేదన్నారు. ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే దాదాపు 25 శాతం పనులే అసంపూర్తి జరిగాయని, ఇంకా 75 శాతం పనులకు రూ.60 వేల కోట్ల నుంచి రూ.70 వేల కోట్లు కావాల్సి ఉందన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ప్రాజెక్టు వద్దకు తీసుకొచ్చి, పనులు వేగవంతంగా కొనసాగేలా చర్యలు చేపడతామన్నారు. మరో మూడు నెలల్లో నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి ఏదుల రిజర్వాయర్‌కు నీరు పారేలా చర్యలు చేపడతామన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వంలో న్యాయం చేస్తామన్నారు. పక్కా గృహాలు మంజూరు చేసి, పూర్తిస్థాయిలో పరిహారం అందిస్తామన్నారు.

ఎంజీఎల్ఐ నుంచి లక్ష్యం మేర నీరందిస్తాం

ఐదు పంపుల ద్వారా నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరందేలా డిజైన్ చేసిన మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం రెండు మోటార్లు నాలుగేళ్లుగా పని చేయడం లేదన్నారు. కేవలం మూడు మోటార్లు పని చేయడంతో లక్ష్యం మేర నీరు అందించలేమన్నారు. త్వరలోనే మరమ్మతుల్లో ఉన్న రెండు మోటార్లు కూడా పని చేసేలా చర్యలు చేపట్టి, లక్ష్యం మేర సాగునీరు అందిస్తామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహాత్మా గాంధీ, భీమా, నెట్టెంపాడుతో పాటు జూరాల ప్రాజెక్టుల కాల్వల్లో పేరుకుపోయిన జమ్మును తొలగించేలా చర్యలు చేపడుతామన్నారు. ఆ దిశగా అధికారులు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. అమరవీరుల త్యాగాలకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. అవినీతికి అవకాశం లేకుండా, గత ప్రభుత్వం.. ఈ ప్రభుత్వానికి మార్పు కనిపించేలా ముందుకు పోతున్నామన్నారు. ఆరు గ్యారెంటీల్లో గృహజ్యోతి, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ల కోసం జిల్లాలో సగం మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని, అర్హులందరూ ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు చేసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ఈఈ శ్రీనివాస్ రెడ్డి, ప్రాజెక్టు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

భర్తను చంపిన భార్య

- నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఘటన



శివశంకర్(ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం, జూన్ 28 : భర్తను భార్య కిరాతకంగా బండరాయి, కర్రతో దాడి చేసి హత్య చేసిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నట్లు సీఐ కనకయ్య శుక్రవారం తెలిపారు. స్థానిక క్రిస్టియన్ కాలనీలో శివశంకర్(35), శివలీల భార్యాభర్తలు నివాసం ఉంటున్నారు. శివశంకర్ హమాలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శివలీల మరో వ్యక్తితో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తోందని భర్త శివశంకర్‌కు తెలియడంతో ప్రవర్తన మార్చుకోవాలని పలుమార్లు హెచ్చరించాడు. దీంతో భార్య శివలీల తరచుగా భర్తతో గొడవపడేది. గురువారం రాత్రి భార్యాభర్తలిద్దరూ మద్యం తాగడంతో మళ్లీ గొడవ జరిగింది. దీంతో ఆవేశానికి గురైన శివలీల, శివశంకర్ తలపై బండరాయి, కర్రతో తీవ్రంగా కొట్టడంతో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి అలివేలమ్మ ఫిర్యాదు మేరకు సీఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఇదిలా ఉండగా భర్త మృతి చెందిన తర్వాత శివలీల పరారైంది. నిందితురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.



సుంకేసులకు తగ్గిన వరద

రాజోలి, జూన్ 28 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండల కేంద్ర శివారులోని సుంకేసుల డ్యాంకు శుక్రవారం వరద నీటి ప్రవాహం తగ్గింది. ఉదయం డ్యాంకు ఎగువ నుంచి 600 క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయని, సాయంత్రానికి 300 క్యూసెక్కులకు తగ్గడంతో డ్యాం గేట్లు పూర్తిగా మూసేశారు. దీంతో డ్యాం నిండుకుండను తలపిస్తోంది. శుక్రవారం సాయంత్రం డ్యాంలో గరిష్ఠ నీటిమట్టం 292.00 కాగా, ప్రస్తుతం పూర్తి స్థాయిలో నీరు ఉందని, డ్యాం సామర్థ్యం 1.20 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.20 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డ్యాం జేఈ రాజు తెలిపారు.

రైస్ మిల్లర్ల ఇష్టారాజ్యం

- వనపర్తి జిల్లాలో రెండు రైస్ మిల్లులపై టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు
- 2.40 లక్షల బస్తాలు పక్కదారి పట్టినట్లు గుర్తింపు
- సీఎంఆర్ అప్పగించడంలో నిర్లక్ష్యం

వనపర్తి అర్బన్, జూన్ 28: సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) అప్పగించే విషయంలో రైస్ మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం సేకరించి సీఎంఆర్ కోసం మిల్లర్లకు ఇస్తోంది. ఆ ధాన్యాన్ని మర ఆడించి, బియ్యాన్ని నిర్ణీత సమయంలో తిరిగి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది. అయితే బియ్యం అప్పగించడంలో మిల్లర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొందరు మిల్లర్లు అధికారులకు మామూళ్లు ఇచ్చి, ధాన్యాన్ని ఇతర రాష్ట్రాలకు అమ్ముకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అనంతరం రేషన్ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి, సీఎంఆర్‌గా అప్పగిస్తున్నారని తెలుస్తోంది. తాజాగా గురువారం రాత్రి సివిల్ సప్లయ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు వనపర్తి జిల్లాలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వనపర్తి పరిధిలోని అచ్యుతాపురం మహాలక్ష్మి రైస్ మిల్లులో రెండు లక్షలా 50 వేల బస్తాల ధాన్యం పక్కదారి పట్టినట్లు అధికారులు గుర్తించారు. అదే విధంగా శ్రీరంగాపూర్ మండల పరిధిలోని నాగరాల అల్లాజీ బాయిల్డ్ రైస్ మిల్లులో మూడు లక్షల ధాన్యం బస్తాలు లేనట్లు అధికారులు గుర్తించారని సమాచారం. అయితే ఈ విషయంపై డీటీ వేణును వివరణ అడుగగా శ్రీరంగాపూర్‌లోని అల్లాజీ బాయిల్డ్ మిల్లులో ఎలాంటి ధాన్యం పక్కదారి పట్టలేదని తెలిపారు. అచ్యుతాపురం మహాలక్ష్మి మిల్లులో టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ ద్రోణాచార్యుడు ఆధ్వర్యంలో దాడులు చేయగా, రెండు లక్షలా 40 వేల బస్తాలు పక్కదారి పట్టినట్లు గుర్తించినట్లు మరో డీటీ నందకిషోర్ తెలిపారు. కేసు కూడా నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో సివిల్ సప్లయ్ పాలమూరు జిల్లా మేనేజర్ ప్రవీణ్, ఆర్ఐ మధు, డీటీ నందకిషోర్ పాల్గొన్నట్లు తెలిపారు.

సమస్యలతో స్వాగతం

- ఎట్టకేలకు మునిసిపల్ సాధారణ సమావేశానికి తేదీ ఖరారు
- ఆరు నెలల తరువాత జరుగనున్న కౌన్సిల్ సమావేశం
- మొదటి సమావేశంలో నూతన చైర్మన్‌కు సమస్యల తలపోటు
- జనరల్ బడ్జెట్ నిల్.. 15వ ఆర్థిక సంఘం నిధులపైనే ఆధారం
- నేటి సమావేశం రసాభాసగా మారే అవకాశంతో సర్వత్రా ఆసక్తి



వనపర్తి మునిసిపల్ కార్యాలయం

వనపర్తి టౌన్, జూన్ 28 : నిత్యం ఏదో ఒక వివాదాలతో వార్తల్లో నిలిచే మునిసిపల్ కార్యాలయంలో ఎట్టకేలకు సాధారణ సమావేశానికి తేదీ ఖరారు అయ్యింది. వార్డుల్లో నెలకొన్న సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లాలనే ధోరణితో ఉన్న కౌన్సిలర్లకు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సమావేశానికి ఆరు నెలల పాటు నిరీక్షణ తప్పలేదు. ప్రతీనెల కౌన్సిల్ సమావేశం నిర్వహించి పట్టణ ప్రజల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆ ఊసే మరిచి ఆరు నెలలు అవుతుంది. ఈ ఏడాది జనవరి మాసంలో జరిగిన బడ్జెట్ సమావేశమే చివరి సమావేశం. మళ్లీ ఆరు నెలల తరువాత శనివారం మునిసిపల్ సాధారణ సమావేశం జరగనుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

అవిశ్వాసం తరువాత మొదటిది..

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన పాలకవర్గంలో ఆనాటి చైర్మన్, వైస్ చైర్మన్‌పై జనవరి నెలలో అవిశ్వాస తీర్మానానికి కౌన్సిల్ సభ్యులు కలెక్టర్‌ను ఆశ్రయించారు. కలెక్టర్ అవిశ్వాసం ప్రవేశపెట్టక ముందే ఆనాటి మంత్రి నిరంజన్‌రెడ్డి ఆదేశాలతో చైర్మన్, వైస్ చైర్మన్‌లు తమ పదవులకు వ్యక్తిగత కారణాలు చూపిస్తూ రాజీనామాలు చేశారు. దీంతో అవిశ్వాసం లేకుండానే ఏకగ్రీవంగా చైర్మన్‌గా పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్‌గా పాకనాటి కృష్ణ నూతనంగా ఎన్నికయ్యారు. అవిశ్వాసం తరువాత కొత్తగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు ఈ సమావేశమే మొదటిది కావడంతో నేడు జరగనున్న సమావేశం రసాభాసాగా మారడం ఖాయంగా తెలుస్తోంది.

ఖజానా ఖాళీ..

మునిసిపల్ సమావేశంలో చర్చించి పరిష్కరించుకోవాల్సిన ప్రజా సమస్యల పరిష్కారానికి కావల్సిన నిధులు మునిసిపాలిటీ జనరల్ ఫండ్స్‌లో ఖజానా లేకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులపైనే ఆధారపడాల్సి వస్తోంది. మునిసిపాలిటీలకు పట్టుకొమ్మలాంటి జనరల్ ఫండ్స్ కేవలం కార్మికుల జీతభత్యాలకే సరిపోతున్నాయి. దీంతో నామ్స్ ప్రకారం ఖర్చు చేయాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులపైనే కౌన్సిల్ సభ్యులు నమ్మకం పెట్టుకున్నారు. కేవలం వాటర్ సెక్షన్, శానిటేషన్ విభాగాలకు మాత్రమే ఖర్చు చేయాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులతో మునిసిపాలిటీని ఎలా నెట్టుకొస్తారో.? సమావేశానికి కొత్తగా అధ్యక్షత వహిస్తున్న చైర్మన్‌కు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి.

సమస్యలే అనేకం..

వనపర్తి మునిసిపాలిటీలో అనేక సమస్యలు పాలకవర్గ సభ్యులకు ఎదురుపడుతున్నాయి. ముఖ్యంగా పట్టణంలో నిలిచిపోయిన రోడ్ల విస్తరణ, వార్డుల్లో పడకేసిన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు, పార్కుల అభివృద్ధి, మీడియన్ ప్లాంటేషన్ పనులు, సెంట్రల్ లైటింగ్ పనులు, వీధి దీపాల మరమ్మతుల నిర్వహణ, చెత్త సేకరణ వాహనాల నిర్వహణ వంటి అనేక సమస్యలు కొత్తగా కొలువుదీరిన పాలకవర్గానికి స్వాగతం పలుకుతున్నాయి. అంతేకాకుండా నేడు జరగనున్న సమావేశం చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు కమిషనర్, ఏఈలకు కూడా ఇదే మొదటి సమావేశం కావడంతో ఎదురుపడుతున్న సమస్యలను ఎలా అధిగమిస్తారో చూడాలి.

ఎమ్మెల్యే సహకారంతో ముందుకు..



వనపర్తి మునిసిపాలిటీని అన్ని హంగులతో అభివృద్ధి పరచడానికి ఎమ్మెల్యే సహకారంతో ముందుకు సాగుతున్నాం. త్వరలోనే ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రభుత్వంతో మాట్లాడి ప్రత్యేక నిధులు తెస్తారని దృఢ సంకల్పంతో ఉన్నాం. గత పాలకులు మునిసిపాలిటీలో నిధులు లేకుండా ఖాళీ చేశారు. ప్రస్తుతం ఒక్కొక్కటిగా గాడిన పెడుతు పట్టణ సర్వతోముఖాభివృద్ధి కోసం కృషి చేస్తున్నాం.

- పుట్టపాకల మహేష్, మునిసిపల్ చైర్మన్, వనపర్తి.

కలెక్టర్ ఆదేశాలతో ఆదాయం పెంచుకుంటాం..



కలెక్టర్ ఆదేశాల మేరకు మునిసిపాలిటీకి రావల్సిన ఆదాయాన్ని పెంచుకునేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం. మునిసిపల్ జనరల్ ఫండ్స్ కేవలం జీతభత్యాలకే సరిపోవడం లేదు. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధులపైనే ఆధారపడాల్సి వస్తోంది. ప్రాపార్టీ ట్యాక్స్ వాటర్‌బిల్స్ ఫ్లెక్సీల ప్రచారం ద్వారా మునిసిపాలిటీకి రావల్సిన ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆదాయం పెంచుకుంటాం.

- పూర్ణచందర్, కమిషనర్, పురపాలక సంఘం వనపర్తి.

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు

- వైద్య ఆరోగ్య శాఖ స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మోతీలాల్
- వనపర్తిలో ప్రైవేటు క్లినిక్‌లు, ల్యాబ్‌ల తనిఖీ



వనపర్తిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మోతీలాల్

వనపర్తి వైద్యవిభాగం, జూన్ 28 : ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేటు ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ కేంద్రాలు వ్యవహరించాలని, లేకపోతే చర్యలు తప్పవని వైద్య ఆరోగ్యశాఖ స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మోతీ లాల్ హెచ్చరించారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ కేంద్రాలను ఆయన వైద్యాధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ కింద నిర్వహణ, ప్రజల బాధ్యతలు, ప్రజల హక్కుల గురించి ప్రైవేటు అల్లోపతి, ఆయూష్ క్లినిక్‌లకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ క్లినిక్ ఎస్టాబ్లిష్మెంట్ సేవలు, సౌకర్యాలకు సంబంధించిన అన్ని ప్రమాణాలు పాటించేలా చూడాలన్నారు. ప్రతీ ప్రైవేటు క్లినిక్‌లో రిసెప్షన్ వద్ద ధరల పట్టిక ఉండాలని, నిర్ణీత కనీస పరికరాలు, మానవ వనరులు కలిగి ఉండాలన్నారు. అగ్నిమాపక పరికరాలు తప్పని సరిగా ఉండాలని, ప్రైవేటు క్లినిక్‌లు రిజిస్ట్రేషన్ చేయించుకోకపోతే నిబంధనల ప్రకారం చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు, స్టేట్ ఏవో శ్రీనివాసులు, ఎస్‌వో కోటేశ్వర్‌రావు, ఏఎస్‌వో విజయభాస్కర్, మాస్ మీడియా అధికారి చంద్రయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ మధు, ఎంటీహెచ్‌వో అశోక్ తదితరులున్నారు.

కోళ్ల వ్యర్థాల వాహనం బోల్తా

గద్వాల, జూన్ 28 : జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలోని పుటాన్‌పల్లి స్టేజీ సమీపంలో గద్వాల నుంచి ఎర్రవల్లి వైపు వ్యర్థాలతో వెళ్తున్న వాహనం బోల్తా పడింది. దీంతో వాహనంలోని కోళ్ల వ్యర్థాలు, ఆహార పదార్థాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడటంతో పాటు, డ్రైవర్ చిన్న మారెన్నకు గాయాలు అయ్యాయి. అప్పుడే ఇటిక్యాల మండలానికి బయలు దేరిన జడ్పీ చైర్‌పర్సన్ సరిత గాయపడిన డ్రైవర్‌ను ఇతర వాహనంలో తరలించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. రోడ్డుపై పడిన వాహనాన్ని పక్కకు తీశారు. అయితే వ్యర్థాలు దుర్వాసన వస్తుండటంతో అటుగా ప్రయాణం చేసిన వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని రూరల్ ఎస్సై పర్వతాలు తెలిపారు.



రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన వ్యర్థాలు

పాడి రైతుల ధర్నా



బోయిన్‌పల్లి గ్రామంలో ధర్నా చేస్తున్న పాడి రైతులు, బీజేపీ నాయకులు

మిడ్జిల్, జూన్ 28 : గత రెండు నెలలుగా పాడిరైతులకు రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని, వెంటనే బిల్లులు చెల్లించాలని బీజేపీ జిల్లా నాయకుడు రవీందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ నారాయణ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పాల డబ్బులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ పాడి రైతులు శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం బోయిన్‌పల్లి గ్రామంలో కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ధర్నాకు బీజేపీ నాయకులు మద్దతు తెలిపి, మాట్లాడారు. పాడిరైతులకు బిల్లులు చెల్లించకపోతే వారితో కలిసి తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. లీటరు పాలకు నాలుగు రూపాయల ప్రోత్సాహకం, పశువుల దాణా, కాల్షియం బాటిళ్లను రైతులను ఉచితంగా సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాడి రైతులు, బీజేపీ నాయకులు శేఖర్, నరేష్, హరికృష్ణరెడ్డి, వెంకటేష్‌రెడ్డి, సత్యం, నర్సింహ్మా, వడ్డె శ్రీను, ఎడ్ల నర్సింములు, గణేష్, బంగారు, రాము, అమరనాథ్‌రెడ్డి, రాంచెంద్రి తదితరులున్నారు.

రాజోలిలో చోరీలు

- ఒకేరోజు ఐదు షాపుల్లో దొంగతనానికి యత్నం
- సీసీ కెమెరాలు లేక తప్పించుకుంటున్న దొంగలు

రాజోలి, జూన్ 28 : ఒకేరోజు ఐదు షాపుల్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి దాదాపు ఒంటి గంట సమయంలో రాజోలి బస్టాండు ఆవరణలో ఉన్న ఒక స్వీటుషాపు, మూతపడిన ఒక ఎలక్ట్రికల్ షాపు, మూతపడిన ఒక జిరాక్సు షాపులో గుర్తు తెలియని వ్యక్తులు ఆయా షాపుల రేకులకు ఉన్న స్క్రూకెళ్లను తొలగించి చోరీకి పాల్పడ్డారు. అనంతరం రెండు గంటల సమయంలో గాంధీచౌక్‌లోని రెండు షాపుల్లో కూడా చోరీకి పాల్పడి షాపులో ఉన్న చిల్లరను ఎత్తుకెళ్లినట్లు షాపు యజమాని నబిసాబ్ తెలిపారు. షాపుల్లో పెద్దమొత్తంలో నగదు పోలేదని ఎవరూ ఫిర్యాదు చేయలేదు. ఈ విషయమై రాజోలి ఎస్సై జగదీశ్వర్‌ను వివరణ కోరగా షాపుల్లో చోరీ జరిగినట్లు తెలుసుకుని పరిశీలించామని, తమ సిబ్బంది రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో నిందితులను గుర్తించలేకపోతున్నామని, త్వరలో సీసీ కెమెరాలు పనిచేసే విధంగా చూస్తామని ఆయన తెలిపారు.

రెంటికి చెడ్డ రేవడి

- అగమ్యగోచరంగా వీఆర్‌ఏల ఉద్యోగాలు
- పలువురికి పదోన్నతులు కల్పిస్తూ పోస్టింగ్‌లు
- 11 నెలలుగా విధులు లేవు.. వేతనాలూ లేవు
- ఆర్థిక ఇబ్బందుల్లో 35 మంది ఉద్యోగులు

మహబూబ్‌నగర్, జూన్ 28 : కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్నట్లుగా వీఆర్‌ఏల పరిస్థితి మారింది. వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పిస్తూ గత ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో వారంతా సంబురపడ్డారు. ఇన్నాళ్లు గ్రామాల్లో కావలికారులుగా ఎన్నో అవమానాలు ఎదుర్కొన్న తమకు గౌరవం దక్కడంతో పాటు జీతభత్యాలు పెరుగుతాయని ఆనందించారు. పదోన్నతులు పొందిన వీఆర్‌ఏలను పలు శాఖల్లో జూనియర్ అసిస్టెంట్లుగా పోస్టింగ్‌లు ఇచ్చారు. చాలామంది ఆయా శాఖలలో చేరి విధులు నిర్వహిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మాత్రం 49 మందిని మునిసిపాలిటీలకు కేటాయించగా ఆయా మునిసిపాలిటీల్లో తమకు కావల్సిన కొంతమందిని మాత్రమే తీసుకుని మిగతా వారు తమకు అవసరం లేదని చెప్పడంతో వారికి మరోచోట పోస్టింగ్‌లు కేటాయించాల్సిన ఉన్నతాధికారులు స్పందించకపోవడంతో 11 నెలలుగా విధులు లేక, వేతనాలూ లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. అప్పటి ప్రభుత్వం 2023 ఆగస్టులో వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పిస్తూ ఇరిగేషన్, మునిసిపాలిటీ, మిషన్ భగీరథ, విద్యా సంస్థలు, రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లలో వివిధ హోదాల్లో చేర్చుకుంటూ ఉత్తర్వులు జారీ చేశారు.

35 మంది పరిస్థితి అగమ్యగోచరం

పదోన్నతి పొందిన వీఆర్‌ఏలలో జూనియర్ అసిస్టెంట్లుగా 49 మందిని ఎంపిక చేశారు. వీరిలో ఇప్పుడు 35 మందికి విధులు లేవు. వేతనాలూ ఇవ్వకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. పాలమూరు పురపాలికకు 26 మందిని, జడ్చర్ల మునిసిపాలిటీకి 18 మందిని, ఐదుగురిని భూత్పూర్ మునిసిపాలిటీకి కేటాయించగా, పాలమూరు పురపాలికలో తొమ్మిది మందిని, భూత్పూర్‌లో ఐదుగురిని విధుల్లో చేర్చుకోగా మిగతా వారికి పోస్టింగ్‌లు ఇవ్వలేదు. తమకు అంతమంది అవసరం లేదని ఆయా మునిసిపాలిటీలు చేతులెత్తేయగా పాలమూరులో 17 మంది, జడ్చర్ల మునిసిపాలిటీకి కేటాయించిన 18 మందికి పోస్టింగ్‌లు లేకపోవడంతో 11 నెలలుగా వారికి డ్యూటీతో పాటు జీతాలు రాకపోవడంతో దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

ఎంతమంది చుట్టూ తిరిగినా

విధులూ లేక, వేతనాలూ రాక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న 35 మంది తమకు ఏదైనా దారి చూపాలంటూ జిల్లా అధికారుల నుంచి సీఎస్ దాకా, స్థానిక ప్రజాప్రతినిధి నుంచి సీఎం కార్యాలయం వరకు తిరుగుతూనే ఉన్నారు. అసలే 11 నెలలుగా జీతాలు లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూనే అప్పులు చేసి పైరవీలకు తిరగడం, కుటుంబ పోషణకు మళ్లీ చేతులు చాస్తూ అప్పులపాలయ్యామని వాపోతున్నారు. వీఆర్‌ఏగా సొంతూళ్లలో పనిచేసే వీరికి నెలకు రూ.11,185 వరకు జీతం వచ్చేది. జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించడంతో రూ.31,800 వరకు జీతం పెరిగింది. పదోన్నతితో పాటు జీతం పెరిగిందని ఎంతో సంతోషపడ్డారు. కానీ తమతో పాటు పదోన్నతి



రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన జిల్లా జూనియర్ అసిస్టెంట్‌లు (ఫైల్)

పొంది వివిధ శాఖల్లో పనిచేస్తున్న వాళ్లు హాయిగా డ్యూటీ చేస్తూ జీతాలు తీసుకుంటుంటే తాము మాత్రం జీతాలు లేక, అప్పులు చేసి కుటుంబాలను పోషించలేక దినదినగండంగా జీవితాలను నెట్టుకువస్తున్నామని ఆందోళన చెందుతున్నారు. 11నెలలుగా దాదాపు ఒక్కో ఉద్యోగికి రూ.3.50 లక్షల వరకు జీతాలు రావల్సి ఉంది. ప్రతిరోజు మునిసిపాలిటీలకు వెళ్లి సంతకాలు చేసి వస్తున్నామని, అక్కడికి తిరగడానికి కూడా అప్పులు చేసి ఆటోల్లో వెళ్లి రావల్సి వస్తోందని వాపోతున్నారు. నూతనంగా కలెక్టర్‌గా బాధ్యతలు



జూనియర్ అసిస్టెంట్‌లు

చేపట్టిన విజయేం దిరబోయిని కూడా గురువారం కలిసి వినతిపత్రం సమర్పించి తమ సమస్య పరిష్కరించాలని కోరారు. వీరితోపాటు ఇతర శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా సక్రమంగా జీతాలు రావడం లేదని తెలుస్తోం ది. ఇరిగేషన్, జూనియర్ కళాశాలలు, హాస్టళ్లల్లో పని చేసే పలువురికి కూడా ఏడెనిమిది నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని చెబుతున్నారు. మార్చి నుంచి మూడు నెలలు మాత్రమే జీతాలు పడ్డాయని, ఆగస్టు నుంచి ఫిబ్రవరి వరకు ఏడు నెలల జీతాలు రావల్సి ఉందని చెబుతున్నారు. పదో తేదీ వరకు జీతాలు రాకుంటేనే గగ్గోలు పెట్టే అధికారులు 11 నెలలుగా జీతాలు రాకపోతే తమ గురించి ఎందుకు స్పందించ డం లేదని వాపోతున్నారు.

ప్రతీ ఎకరాకు

సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ
- డిండి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసిన అచ్చంపేట, దేవరకొండ ఎమ్మెల్యేలు



డిండి ప్రాజెక్టు కుడి గేటు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న అచ్చంపేట, దేవరకొండ ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, బాలునాయక్

ఉప్పునుంతల, జూన్ 28 : ప్రతీ ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం లత్తిపూర్ గ్రామ శివారులోని డిండి ప్రాజెక్టు కుడి కాలువ గేటును నల్లగొండ జిల్లా దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి ఎత్తి మూడు గ్రామాల రైతులకు సాగునీరు అందించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ డిండి ప్రాజెక్టు నుంచి నల్గొండ జిల్లాతో పాటు ఉప్పునుంతల మండలంలోని లత్తిపూర్, గువ్వలోనిపల్లి, పెనిమిళ్ల గ్రామాల్లో 250 ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. అంతకుముందు ప్రాజెక్టు కుడిగట్టున కొలువై ఉన్న కట్ట మైసమ్మ ఆలయంలో ఎమ్మెల్యేలు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు అనంతప్రతాప్‌రెడ్డి, ఈఈ శ్రీధర్, డీఈ శ్రీనివాసులు, ఏఈ ఫయాజ్, నాయకులు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

ఎర్రవల్లి, జూన్ 28 : యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం సాతనూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాము, సత్యమ్మ దంపతుల కుమారుడు రవి(20) శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రవి డిగ్రీ చదువుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. కాగా, యువకుడి ఆత్మహత్య గల కారణాలు తెలియరాలేదు. ఈ విషయంపై కోదండాపురం ఎస్సై స్వాతిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- కేసు నమోదు



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై మంజునాథ్‌రెడ్డి

కొత్తకోట, జూన్ 28 : తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన మందడి శ్రీనివాసులు ఈనెల 25వ తేదీన ఇంటికి తాళం వేసి కూతురు జన్మదిన వేడుకల నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. శుక్రవారం ఇంటి తలుపులు తెరుచుకొని ఉండడం.. ఎవరు కనబడకపోవడంతో పక్కింటివారు లోపలకు వెళ్లి చూడగా బీరువాలోని బట్టలు కిందపడి ఉన్నాయి. దొంగతనం జరిగిందని గమనించి శ్రీనివాసులుకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి బీరువాను పరిశీలించగా రెండు తులాల బంగారు గొలుసు, 30 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.1500 నగదు చోరీకి గురైందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని క్లూస్ టీంతో ఆధారాలను సేకరించామని ఎస్సై తెలిపారు.

హైలెస్సా..

- తోస్తే కాని ముందుకు కదలని ఆర్టీసీ బస్సు



అయిజలో ఆర్టీసీ బస్సును ముందుకు తోస్తున్న ప్రయాణికులు

అయిజ, జూన్ 28 : ఆర్టీసీ అన్ని విధాలుగా తోస్తే కానీ.. ముందుకు కదలని పరిస్థితి ఏర్పడింది. జోగుళాంబ గద్వాల డిపోలో 140 బస్సులు ఉంటే తప్ప ప్రయాణికులకు న్యాయం చేయలేని పరిస్థితి. కానీ ప్రస్తుతం 90 బస్సులు మాత్రమే ఉన్నట్లు తెలుస్తోంది. ఉన్న బస్సులు సైతం చాలామటుకు ముందుకు కదలటానికి మొరాయిస్తున్నాయి. శుక్రవారం అయిజ బస్టాండులో ఏపీ22 జడ్0085 నెంబరు గల ఆర్టీసీ బస్సు ముందుకు కదలటానికి మొరాయిస్తుండటంతో ప్రయాణికులు తోస్తే తప్ప ముందుకు కదలలేదు. గద్వాల డిపో పరిధిలో చాలా గ్రామాలకు బస్సులు లేవు. ఎమ్మిగనూర్ నుంచి అయిజకు ఈ డిపో బస్సులు మూడు తిరుగుతుంటే.. అయిజ నుంచి గద్వాల డిపో బస్సు ఒక్కటి మాత్రమే తిరుగుతోంది. రెవెన్యూ గ్రామం అయిన సింధనూర్ గ్రామానికి అసలే బస్సు లేదు. ఇదేమని అధికారులను ప్రశ్నిస్తే డిపో పరిధిలో బస్సులు లేవని సమాధానం. ఉన్న బస్సులు సైతం ముందుకు కదలకుండా మొరాయిస్తున్నాయి. ప్రభుత్వం, అధికారులు దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎండుముఖం పడుతున్న పంటలు



యాదిరెడ్డిపల్లి గ్రామంలో ఎండుముఖం పడుతున్న పత్తి మొలకలు

తాడూరు, జూన్ 28 : ఖరీఫ్‌లో మంచి దిగుబడులు సాధించాలనే ఉద్దేశంతో పత్తి విత్తనాలు నాటిన అన్నదాతలకు ఇటీవల గత 15-20 రోజులుగా వర్షాలు ముఖం చాటేయడంతో మొలచిన పత్తి మొలకలన్నీ ఎండుముఖం పడుతున్నాయి. దీంతో అన్నదాతలు తీవ్ర మానసిక ఆవేదన చెందుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండల వ్యాప్తంగా ఎక్కువ మొత్తంలో 20వేల ఎకరాలకు పైగా పత్తి పంట సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పత్తి మొలక దశలోనే వర్షాలు లేక ఎండుముఖం పడుతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత నాలుగైదు రోజులుగా వర్షాలు పడే అవకాశాలున్నాయంటూ వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ వర్షం కురవకపోవడంతో అటు ఆకాశం, ఇటు పంటల వైపు చూస్తూ అన్నదాతలు దిగాలు పడుతున్నారు. ఏదేమైనా ఈ రెండు మూడు రోజుల్లో వర్షాలు కురియకపోతే పత్తి మొలకలపై ఎదుగుదలకు సంబంధించి తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. దీనికి తోడు ఆ ప్రభావం దిగుబడులపై పడి నష్టాలు చవిచూసే అవకాశాలే ఎక్కువ ఉన్నాయంటూ అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

రేపు ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 28 : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో జూలై నెలలో జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి బాలికల జట్టును ఈనెల 30న కల్వకుర్తి స్టేడియం మైదానంలో ఎంపిక చేయనున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ భానుకిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వనపర్తి మినహా పూర్వ మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాకారులు ఉదయం ఎనిమిది గంటలకు తమ ఆధార్‌కార్డుతో హాజరు కావాలని కోరారు. 1-12-2011 నుంచి డిసెంబర్ 2012 మధ్య జన్మించిన వారు ఎంపికలకు అర్హులని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కోడేరు, జూన్ 28 : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం నర్సాయిపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో శుక్రవారం గేదె మృతి చెందింది. స్థానికులు, గేదె యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుర్వ ఎజ్జు బండలమ్మకు చెందిన గేదె గ్రామంలో గొల్లబాలయ్య కిరాణం షాపు దగ్గర ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి కరెంటు రావడంతో అకస్మాత్తుగా అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. గేదె విలువ రూ.50 వేలు ఉంటుందని యజమాని తెలిపారు. విద్యుత్ అధికారులు నష్ట పరిహారం చెల్లించాలని కోరాడు.

వ్యక్తి అదృశ్యం

నవాబ్‌పేట, జూన్ 28 : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం గురుకుంట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చింతకింది యాదయ్య కొంతకాలం క్రితం హైదరాబాద్‌లోని ఆస్మాన్‌ఘాట్‌లో తన భార్యాపిల్లలతో కలిసి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండున్నర నెలల క్రితం కూలీ పనులకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన యాదయ్య ఎంతకూ రాకపోవడంతో ఆందోళన చెందిన సోదరుడు ఆనంద్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆనంద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

చారకొండ, జూన్ 28 : నల్గొండ జిల్లా చింతపల్లి నుంచి ఆమనగల్లుకు తరలిస్తున్న 18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల కేంద్రంలో పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లి గ్రామానికి చెందిన మహేష్ అశోక లేలాండ్ వాహనంలో బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు. పట్టుబడిన బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అప్పజెప్పామన్నారు. పంచనామా చేసి బియ్యాన్ని మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర రైస్‌మిల్లులో భద్రపరిచినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రవి కుమార్‌యాదవ్ తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

- కేసు నమోదు

రాజాపూర్, జూన్ 28 : ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండల కేంద్రంలోని మల్లేపల్లి రోడ్డులో గురువారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నారు. తరలిస్తున్న ఇసుకకు సంబంధించి అనుమతి పత్రాలు లేకపోవడంతో డ్రైవర్‌ను, టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ల సామగ్రి చోరీపై ఫిర్యాదు

వెల్దండ, జూన్ 28 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామంలో వారంరోజులుగా పలువురు రైతులకు చెందిన ట్రాక్టర్ సామగ్రి చోరీపై శుక్రవారం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో గంగపురం రామనాథం, కాయితి ప్రభాకర్‌రెడ్డి, మెండె మల్లేష్ అనే రైతులకు చెందిన ట్రాక్టర్లు ఇంటిముందు పార్కింగ్ చేసి ఉంచగా గుర్తు తెలియని దుండగులు అడ్డరాడ్డు, టాప్‌లింగ్‌లు చోరీ చేశారు. ఈ మేరకు బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆయుత చండీ యాగానికి ముమ్మర ఏర్పాట్లు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 28: జిల్లా కేంద్రంలోని ఓంనగర్‌కాలనీలో శ్రీకృష్ణ పీఠాధిపతి శ్రీకృష్ణజ్యోతి స్వరూపానంద స్వామిజీ ఆధ్వర్యంలో జూలై 7 నుంచి 21 వరకు నిర్వహించ తలపెట్టి ఆయుత చండీ మహాయాగ మహోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. శుక్రవారం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్ల ఈశ్వర్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. హోమ మండపాలు వేదికలను, అవసరమైన కలప సామగ్రి తదితర పనులను ఆయన దగ్గర ఉండి ఏర్పాట్లను చేయిస్తున్నారు. భక్తుల సందర్శనకు అనుగుణంగా ఏర్పాట్లను చేస్తున్నారు.

సమాచార కేంద్రాలుగా రైతు వేదికలు

- మొదటి విడతలో రెండు.. ఇప్పుడు పది
- వీడియో కాన్ఫరెన్స్ మెటీరియల్ బిగింపు

గద్వాల, జూన్ 28 : అన్నదాతలకు ఆధునిక వ్యవసాయంపై సూచనలు, సలహాలు వీడియో ద్వారా తెలుసుకోవడానికి ప్రభుత్వం రైతునేస్తం పేరుతో శిక్షణ, అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది మార్చిలో మొదటి విడుతగా రాష్ట్రంలో 110 కేంద్రాలను ఏర్పాటు చేసి శిక్షణ, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ప్రతీ మంగళవారం ఈ రైతునేస్తం కార్యక్రమంలో విత్తనం నుంచి మొదలుకొని పంటల సాగు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటలకు అందించాల్సిన నీరు, ఎరువులు, యాజమాన్య పద్ధతులు, చీడపురుగుల నివారణ, సేంద్రియ వ్యవసాయ విధానాలు, యాంత్రికీకరణ మొదలు వ్యవసాయ పద్ధతులను రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాల అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, నిపుణులతో అవగాహన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. జిల్లాలో మొదటి విడుతలతో అయిజ మండల కేంద్రంతో పాటు, మల్దకల్ మండల కేంద్రంలోని రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో ఎల్‌ఈడీ టీవీ, వీడియో కెమెరాలు, స్టాండ్, సౌండ్ సిస్టమ్ తదితర మెటీరియల్‌ను బిగించారు.

రైతులకు అందుబాటులో లేవని..

రైతునేస్తం ద్వారా జిల్లాలో రెండు చోట్ల



అయిజ కేంద్రంలో రైతు నేస్తం కార్యక్రమం

మాత్రమే శాస్త్రవేత్తలతో అవగాహన, శిక్షణలు ఏర్పాటు చేయడంతో జిల్లాలోని 97 క్లస్టర్‌లలో ఉన్న రైతువేదిక పరిధిలోని రైతులకు సమాచారం అందడం లేదు. అయిజ, మల్దకల్‌లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లు రైతులకు చాలా దూరం ఉండటంతో ప్రతీ మంగళవారం రైతులు అక్కడికి రాలేదు. దీంతో ప్రతీవారం నిర్వహించే రైతునేస్తం కార్యక్రమానికి చాలా తక్కువమంది రైతులు హాజరు అయ్యేవారు. దీని వలన చాలామంది రైతులు శాస్త్రవేత్తలు ఇచ్చే శిక్షణ, సూచనలు, సలహాలకు దూరం అవుతున్నారనే విమర్శలు రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ మండలానికి ఒక రైతునేస్తం కేంద్రాన్ని మంజూరు చేసింది. వీటిని రైతువేదికల్లో ఏర్పాటుచేసే విధంగా చూస్తున్నారు. ఈ నెలాఖరులోగా ఎల్‌ఈడీ టీవీ, వీడియో కెమెరాలు, స్టాండ్, సౌండ్ సిస్టమ్ తదితర మెటీరియల్‌ను బిగించి జూలై ఒకటో తేదీ నుంచి అందుబాటులోకి తేనున్నారు.

జిల్లాలో రైతునేస్తం కేంద్రాలు ఇవే..

మొదటి విడుతలో అయిజ, మల్దకల్ కేంద్రాలు ఇవ్వగా రెండవ విడుతలో జిల్లాకు పది కేంద్రాలు వచ్చాయి. గద్వాల మండలం చెనుగోనిపల్లి రైతువేదిక, ధరూర్ రైతువేదిక, గట్టులో గొర్లఖాన్‌దొడ్డి, కేటీదొడ్డిలో మైలగడ్డ, అలంపూర్‌లో బుక్కాపురం, ఇటిక్యాల మండలంలో షుటాన్‌దొడ్డి, వడ్డేపల్లిలో కొంకల రైతువేదిక, మానవపాడు రైతువేదిక, ఉండవెల్లి రైతువేదిక, రాజోలి రైతువేదికలలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ప్రతీ మంగళవారం శాస్త్రవేత్తలతో రైతులు నేరుగా మాట్లాడటానికి, సూచనలు, సలహాలు తీసుకోవడానికి వీలు ఉంటుంది.

ఒండ్రుమట్టి తరలింపుపై ఆగ్రహం

- టిప్పర్లను అడ్డుకున్న అల్లమాయపల్లి గ్రామస్థులు

ఖిల్లాఘణపురం, జూన్ 28 : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని గణపసముద్రం చెరువు నుంచి అల్లమాయపల్లి శివారు ప్రాంతంలో డంపింగ్‌కు తరలిస్తున్న ఒండ్రుమట్టి టిప్పర్లను శుక్రవారం సాయంత్రం రోడ్డుమీది తండా, అల్లమాయపల్లి గ్రామస్థులు అడ్డుకున్నారు. గణపసముద్రం చెరువు నుంచి కురుమూర్తిరాయ రిజర్వాయర్‌కు ఒండ్రుమట్టి తరలింపునకు అనుమతులు పొంది సుశీప్రసాద్ ఏజెన్సీ వారు అల్లమాయపల్లి శివారు ప్రాంతంలో ఒండ్రుమట్టిని టిప్పర్ల ద్వారా తరలించి డంపింగ్ చేస్తున్నారు. ఈనెల ఒకటో తేదీన ఒండ్రుమట్టి తరలింపునకు ఇరిగేషన్ అధికారుల వద్ద అనుమతులు పొంది ప్రతీరోజు 24 గంటల పాటు అతివేగంగా (భారీ వాహనాలు) టిప్పర్లలో తరలిస్తుండడంతో ప్రధాన రహదారి బీటీపై ఒండ్రుమట్టి పడడంతో వాహనాలు జారీ ప్రమాదాలకు గురై కింద పడుతున్నామని ఆవేదనతో గ్రామస్థులు ఒండ్రుమట్టి తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకున్నారు. గ్రామాల్లోని ప్రజలు



గ్రామస్థులు అడ్డుకోవడంతో రోడ్డుమీది తండా ప్రధాన రహదారిపై నిలిచిన ఒండ్రుమట్టి తరలిస్తున్న టిప్పర్లు

ప్రమాదాలకు గురైతే ఎవరిది బాధ్యత అని వారు ప్రశ్నించారు. సుమారు మూడు గంటల పాటు ఆగిపోయిన టిప్పర్ల సమాచారంతో రంగ ప్రవేశం చేసిన పోలీసులు గ్రామస్థులకు నచ్చజెప్పి పంపించేశారు. గ్రామస్థులు ఆందోళన చేపట్టినా మట్టి తరలించే ఏజెన్సీ నిర్వాహకులు రాకపోవడంపై ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేశారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

- పది శాతం ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాలి
- కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజుగౌడ్

ఆత్మకూరు, జూన్ 28: ప్రభుత్వ, దేవాదాయ భూములు, వెంచర్లలోని 10 శాతం ల్యాండ్ లను ఆక్రమించుకున్న వారిపై చర్యలు చేపట్టే వరకు కాంగ్రెస్ పార్టీ వదిలిపెట్టదని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజుగౌడ్ అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పక్కన ఉన్న 10 శాతం ల్యాండ్‌లో అక్రమంగా వెలసిన వ్యాపార సముదాయాల్లో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మునిసిపాలిటీగా ఏర్పడినప్పటి నుంచి వెంచర్లలో 10 శాతం ల్యాండ్ ఇక్కడ ఉన్న అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు కబ్జా చేసుకుని విక్రయాలు జరిపారని ఆరోపించారు. ఇప్పటికీ అక్రమంగా వెలసిన నిర్మాణాలపై నోటీసులు జారీ చేశారు కానీ చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. తక్షణమే కబ్జాకు గురైన 10 శాతం ల్యాండ్ దేవాదాయ భూములు ప్రభుత్వ భూములను తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని తెలిపారు. లేనిపక్షంలో నిరవధిక సమ్మె చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు పరమేష్, శ్రీనివాసులు, నాయకుడు మొగిలి



రిజిస్ట్రార్ కార్యాలయం పక్కన ఉన్న అక్రమ కట్టడాలపై నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

గంగాధర్ గౌడ్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బాల కిష్టన్న తదితరులున్నారు.

అక్రమ నిర్మాణాల తనిఖీ

ఆత్మకూరు పట్టణంలో 10 శాతం ల్యాండ్, దేవాదాయ, ప్రభుత్వ భూమిని ఆక్రమించారని ఆరోపణలు రావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆత్మకూరు పట్టణంలో ఆకస్మిక తనిఖీలు చేసినట్లు టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి సుధాకర్ తెలిపారు. వేంకటేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించిన 42 ఎకరాలలో ఒక ఎకరం కబ్జాకు గురైందని తెలిపారు. వాటిపై సమగ్ర నివేదిక తీసుకుని జిల్లా ఉన్నత అధికారులకు అందిస్తామని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి

ప్రతీ శుక్రవారం డ్రై డే నిర్వహించాలి

- అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్



డ్రై డే ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మహబూబ్‌నగర్, జూన్ 28 : ప్రతీ శుక్రవారం డ్రై డేగా పాటించి నీటి నిల్వలను ఖాళీ చేయాలని అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ అన్నారు. శుక్రవారం మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డితో కలిసి పట్టణంలోని పలు వార్డులలో ర్యాలీ నిర్వహించారు. డ్రై డే సందర్భంగా ఇంట్లో, వీధుల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దీనివల్ల దోమలు వృద్ధిచెందకుండా నివారించవచ్చని తెలిపారు. ఇళ్లల్లో పూలతొట్లు, ఎయిర్ కూలర్లు, కొబ్బరిబోండం ముక్కలు, పాతటైర్లు, డ్రమ్ములు వంటి వాటిలో నీరు నిలువ ఉంటే పారబోయాలని సూచించారు. అనంతరం ఇంటింటికీ డ్రై డే అంశాలతో ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు.

● శిథిలమైన అద్దె దుకాణాల పరిశీలన : పాలమూరు పురపాలికకు సంబంధించి శిథిలమైన అద్దె దుకాణాలను మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్ పరిశీలించారు. అవసరం ఉంటే మరమ్మతులు చేయించాలని సూచించారు. అదేవిధంగా నీటి లీకేజీ పనులను పరిశీలించారు. లీకేజీలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : డీఎంహెచ్‌వో

అడ్డాకుల, జూన్ 28 : సీజనల్ వ్యాధుల పట్ల గ్రామస్థులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని శాఖాపూర్‌లో ఫ్రైడే- డ్రైడే కార్యక్రమంలో భాగంగా వీధుల్లో తిరిగి నీటి నిల్వలు ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, సూచనలు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ శుష్మా, ఎంఎల్‌హెచ్‌పీ నాగరాజు, ఎన్‌సీడీ సుభాష్ చంద్ర, ఎంపీహెచ్‌ఈఓ వెంకటేశ్, కార్యదర్శి లలిత, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి

గండీడ్, జూన్ 28 : ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మొదట మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. అనంతరం 48 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. రంగారెడ్డిపల్లిలో ఎస్సీ కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్డును, కప్లాపూర్, జానంపల్లి గ్రామాల్లో సీసీ రోడ్లను, గోవింద్‌పల్లిలో బీసీ కమ్యూనిటీ హాల్‌తో పాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆగస్టు 15 వరకు రైతు లకు రుణమాఫీ అంతా సిద్ధం చేసినట్లు తెలిపారు. గండీడ్‌లో అంతర్జాతీయ పాఠశా లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కేజీబీవీ భవనం కోసం రూ.5 కోట్ల నిధులు మంజూర య్యాయని, వెంటనే పనులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వెన్నాచేడ్ సాయిరాం ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాధవి, జడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ నాగలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, పరిగి ఎంపీటీసీ బాలయ్య, శైలజ, బాలవర్ధన్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆశన్న, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచు పుల్లారెడ్డి, బి.గోపాల్, సుదర్శన్ రావు, లక్ష్మారెడ్డి, కిష్టయ్య, పులిందర్‌రెడ్డి, అనంతయ్య పాల్గొన్నారు.

బోధనావైద్యుల నిరసన


- నల్గొండ జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), జూన్ 28 : నల్గొండ జిల్లా కలెక్టర్ జనరల్ ఆసుపత్రిలో పనిచేసే వైద్యులపై ఇచ్చిన ఆర్డర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట బోధనా వైద్యుల సంఘం ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ వైద్యకళాశాలలో కూడా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కిరణ్ ప్రకాశ్ మాట్లాడుతూ నల్గొండ జనరల్ ఆసుపత్రిలో పనిచేసే డాక్టర్ల హాజరును పర్యవేక్షించేందుకు అక్కడ ఒక జిల్లా అధికారిని ఇన్‌చార్జిగా నియమించి డ్యూటీలు వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఆసుపత్రులపై కలెక్టర్ అధికారాలు ఏంటని, తమ పనితీరు, గైర్హాజరు, హాజరును పర్యవేక్షించేందుకు ఎన్ఎంసీ, డీఎంఈతో పాటు ఏఈబీఏఎస్ అనే వ్యవస్థ కూడా ఉందన్నారు. కలెక్టర్ హెచ్‌డీఎస్‌లో సభ్యులేనని, అంతకు మించి తమపై అధికారం చెలాయించే అధికారాలు లేవని, దీనికి తమ సంఘం తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఆర్డర్‌ను వెనక్కి తీసుకోవాలని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఆసుపత్రి, వైద్యకళాశాల డాక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా షా అబ్దుల్ రహమాన్ దర్గా గంధోత్సవం

కోయిలకొండ, జూన్ 28 : జిల్లాలో ప్రసిద్ధి చెందిన కోయిలకొండ షా అబ్దుల్ రహమాన్ వడెన్న దర్గా గంధోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దర్గా పీఠాధిపతి సయ్యద్ జలాలొద్దీన్ ఇంట్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గంధోత్సవాన్ని వడెన్న దర్గా వరకు ఊరేగించారు. అనంతరం దర్గాకు ఛాదర్, గులాబీ పూలు వివిధ సుగంధ ద్రవ్యాలను అలంకరించి ముస్లి మత పెద్దలు ప్రార్థనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణయ్య, రాజ్‌కుమార్ నాయకులు, రాజు, నారాయణ, రామస్వామి, మనోజ్, గౌస్, నాగరాజు, ఇనియత్‌ఉల్లా, జహీద్, రుస్తుం పాల్గొన్నారు.

దివంగత మాజీ ప్రధాని పీవీకి ఘన నివాళి



నివాళ్లర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహబూబ్ న గర్, జూన్ 28 : దేశంలో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టి ఆర్థి కంగా దేశం బలో పేతానికి కృషి చేసిన దివం గత ప్రధాన మం త్రి పీవీ నర్సింహా రావుకు కాంగ్రెస్ నా యకులు ఘన నివాళ్లర్పించారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీవీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. మైనారిటీ ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నడిపించిన ఘనత పీవీకి దక్కిందని కాంగ్రెస్ మీడియాసెల్ ఇంచార్జి సీజె బెనహర్ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఫహీం, ఏర్పుల నాగరాజు, ఎండీ తాహెర్, అజీజ్ పాల్గొన్నారు.

కేంద్రం బొగ్గు గనుల వేలం ఆపాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నల్లవెల్లి కురుమూర్తి

పాలమూరు/ జడ్చర్ల, జూన్ 28 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గుగనుల వేలం తక్షణమే ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నల్లవెల్లి కురుమూర్తి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయం నుంచి తెలంగాణ చౌరస్తా వరకు సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బొగ్గుగనుల వేలం ఆపాలని భారీ ర్యాలీ, నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో అయన మాట్లాడుతూ సింగరేణి ప్రాంతంలో కేటాయించాల్సిన బొగ్గు గనులను బహిరంగ వేలం పేరుతో ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని కేంద్రప్రభుత్వంపై మండిపడ్డారు. కార్యక్రమంలో గాలెన్న, గోనెల నాగరాజు, తిరుమలగిరి రాములు, హనుమంతు, జహంగీర్, కేశవులు, వెంకటయ్య గోనెల ఆంజనేయులు, వెంకటయ్య, గౌసియా, వెంకట్రాములుగౌడ్, అంజనేయులు, సురేష్ పాల్గొన్నారు.

● జడ్చర్లలోనూ సింగరేణి బొగ్గు గనుల వేలం నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఎం నాయకులు జగన్, తెలుగు సత్తయ్య ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జడ్చర్ల తహసీల్దార్ సత్యనారాయణ రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బాగి కృష్ణ, మున్నా, జయరాములు, యాదయ్య, కృష్ణయ్య, సంధ్యారాణి, కృష్ణవేణి, లలిత, సువార్త, నాగమణి, హన్యానాయక్ పాల్గొన్నారు.

నేడు పురపాలిక కౌన్సిల్ సమావేశం

మహబూబ్‌నగర్, జూన్ 28 : పాలమూరు పురపాలిక కౌన్సిల్ సమావేశం శనివారం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అధ్యతన సమావేశం జరగనుంది. తాగునీరు, పారిశుధ్య నిర్వహణపై ప్రధాన చర్చ జరగనుంది. పట్టణంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లీకేజీ సమస్యలపై చర్చించనున్నారు.

పాఠశాల సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 28 : ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఉర్దూ మీడియం పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, మౌలిక వసతుల కల్పించాలని కోరారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

దేవరకద్ర, జూన్ 28 : ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు దేవరకద్రలో నూతనంగా మంజూరైన డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పద్మ తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రవేశానికి విద్యార్థులు మీసేవలో దోస్త్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులకు కావాల్సిన గ్రూపులు బీఏసీ, ఎంపీసీ, బీజడ్సీ, బీకాం, బీఏహెచ్‌ఈపీ వంటి గ్రూపులు ఉన్నాయని తెలిపారు. అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, మొత్తం 240 సీట్లు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

రాజకీయాలకతీతంగా కేంద్రం నిధులు తెస్తాం

- రూ.260 కోట్ల పనులకు టెండర్లు
- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి రూ.600 కోట్లతో ప్రతిపాదనలు
- టీచర్ల బదిలీలలో రాజకీయ జోక్యం ఉండదు
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జూన్ 28 : వరుసగా ఎన్నికల కోడ్‌తో అభివృద్ధి పనులన్నీ నిలిచిపోయాయని, ఇక పూర్తిస్థాయిలో ప్రభుత్వం అభివృద్ధి పనులపై దృష్టి సారిస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా, పురపాలిక అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు రాబోతున్నాయని చెప్పారు. కేంద్రం నుంచి వచ్చే ప్రతీ రూపాయిని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని అభిప్రాయపడ్డారు. ఇందులో తమకు ఎలాంటి భేషజాలు లేవని, నిధులు రాబట్టేందుకు రాజకీయాలకు అతీతతంగా ఒకసారి కాదు వందసార్లైనా కేంద్రం నాయకులను కలుస్తామని యెన్నం స్పష్టం చేశారు. ఎక్కడో మూలనపడ్డ ఫైల్‌ను తీసి ముఖ్యమంత్రి ద్వారా ఢిల్లీకి పంపితే, సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలో ఒక పార్ట్ పనుల కోసం రూ.260 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. టెండర్ల ప్రక్రియ పూర్తైందని, రెండు నెలల్లో పనులు ప్రారంభమవుతాయన్నారు. దీంతోపాటు పూర్తిస్థాయిలో పాలమూరు పురపాలికలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకోసం రూ.600 కోట్లు ముఖ్యమంత్రి ద్వారా కేంద్రానికి నివేదించామని, ఆ నిధులు వస్తే మురుగునీటి సమస్య తీరుతుందన్నారు. అత్యవసరంగా ఇక పాలమూరులో రూ.37 కోట్లతో డ్రైనేజీలు, కొంత సీసీరోడ్ల పనులు చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. త్వరలోనే చైర్మన్, కౌన్సిలర్ల సమక్షంలో క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. అన్ని పనుల్లో పారదర్శకత పాటిస్తామని, ఇందిరమ్మ ఇళ్ల విషయంలోనూ అర్హులైన లబ్ధిదారులనే ఎంపిక చేస్తామని అన్నారు. ఉపాధ్యాయ బదిలీలలో రాజకీయజోక్యం ఉండదన్నారు. పూర్తిస్థాయిలో బదిలీల ప్రక్రియ పారదర్శంగా జరగాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారని, తామూ అదే విధానం ఫాలో అవుతామన్నారు. వనమహోత్సవం కార్యక్రమాన్ని జిల్లాలో పెద్దఎత్తున చేపట్టాలని నిర్ణయించామని వెల్లడించారు. గత ప్రభుత్వం అడ్డగోలుగా పనులు చేపట్టి మధ్యలో నిలిచిన వాటికి బడ్జెట్ లేదని, వాళ్ల కాంట్రాక్టర్లకు కూడా డబ్బులు చెల్లించలేదన్నారు. వాటిలో అవసరానికి ఉపయోగపడే పనులకు మళ్లీ బడ్జెట్ కేటాయించి వినియోగంలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, నాయకులు సిరాజ్‌ఖాద్రి, లక్ష్మణ్‌యాదవ్ పాల్గొన్నారు.

క్రీడలతో బంగారు భవిష్యత్

- డీవైఎస్‌వో ఎస్. శ్రీనివాస్

- ఉత్సాహంగా స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు



స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల ఎంపికలను పరిశీలిస్తున్న డీవైఎస్‌వో శ్రీనివాస్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 28 : క్రీడాకారులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, బంగారు భవిష్యత్తు ఉంటుందని జిల్లా క్రీడలు, యువజన సర్వీసుల శాఖ అధికారి ఎస్.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించి జిల్లా స్టేడియం మైదానంలో 2024-25 విద్యా సంవత్సరానికి స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతి ప్రవేశాలకు జిల్లా స్థాయి ఎంపికలను డీవైఎస్‌వో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికలకు 22 మంది బాలురు, 8 మంది బాలికలకు మొత్తం 32 మంది హాజరైనట్లు తెలిపారు. విద్యార్థులకు ఎత్తు, బరువు 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, 60 మీటర్ల షటిల్ రన్, 800 మీటర్ల పరుగుల పందెం, స్టాండింగ్ బ్రాండ్ జంప్, ఫ్లెక్సీబిలిటి టెస్ట్, మెడిసిన్‌బాల్‌త్రో తదితర అంశాల్లో పరీక్షలు నిర్వహించామన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హకీంపేటలో జూలై 11, 12 జరగనున్న రాష్ట్రస్థాయి ఎంపిక చేస్తామన్నారు. ఫలితాలను త్వరలో వెల్లడిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి విజయ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ జయశ్రీ, కోచ్‌లు సునీల్‌కుమార్, ఖలీల్, పర్వేజ్, అంజద్, నికేశ్, మల్లేష్, కంప్యూటర్ ఆపరేటర్ ఉమేష్ కుమార్ పాల్గొన్నారు.

భూదాన్ భూమిని కాపాడాలి

జడ్చర్ల, జూన్ 28 : జడ్చర్ల మునిసిపాలిటీలో కోట్ల విలువ చేసే భూదాన్ భూమిని కాపాడాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. జడ్చర్ల నియోజకవర్గ మొట్టమొదటి ఎమ్మెల్యే కొత్తకేశవులు సర్వే నెంబరు 138లోని 2ఎకరాల భూమిని భూదాన్ యజ్ఞబోర్డుకు దానం చేశారని పేర్కొన్నారు. ఆ భూమిని చెన్నయ్య అనే వ్యక్తికి భూదాన్ యజ్ఞ బోర్డు అసైన్ చేయగా, కొందరు నాయకులు తప్పుడు పద్ధతుల్లో ఇతరుల పేరుపై రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారని ఆరోపించారు. అధికారులు భూమిని కాపాడాలని కోరారు.

ఇంకుడు గుంతలతో నీటినిల్వ

గండీడ్, జూన్ 28 : ఇంకుడు గుంతలతో నీరు నిల్వ ఎక్కువగా అవుతుందని ఏపీవో హరిచంద్రుడు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వెన్నాచేడ్ శివారులో పొలాలకు వెళ్లే రోడ్డు పనులను పరిశీలించారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

- మాజీ ఎమ్మెల్యే సీతమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సీతమ్మ

దేవరకద్ర, జూన్ 28 : ప్రజలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని మాజీ ఎమ్మెల్యే సీతమ్మ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నాగారం గ్రామంలో ప్రీతిష్యార్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉచిత వైద్యం అందించాలని వైద్యశిబిరాల్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రజలు వైద్య సేవలను పొందాలన్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, మచ్చేందర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, అర్జున్‌చారి, గ్రామస్థులు, వ్యవస్థాపకులు చంద్రమోహన్, వైద్యులు పాల్గొన్నారు.

బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



శాఖాపూర్‌లో బాధితుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

అడ్డాకుల/ భూత్పూర్, జూన్ 28 : మండల పరిధిలోని శాఖాపూర్‌లో ఇటీవల మరణించిన బీఆర్ఎస్ కార్యకర్త సత్యారెడ్డి కుటుంబ సభ్యులను, అదేవిధంగా రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న డ్రైవర్ పట్నం సాయిరాంను, పొన్నకల్‌లో ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి తండ్రి వెంకట్‌రాంరెడ్డి ఇటీవల మరణించడంతో శుక్రవారం దేవర కద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అడ్డా కుల జడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్ రెడ్డిలు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామానికి చెందిన బాల్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం బాధితుని ఇంటి వెళ్లి పరామర్శించారు. ఈయన వెంట అడ్డాకుల జడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి, స్థానిక మాజీ ఉప సర్పంచ్ రాజారెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు ఖాజా పాల్గొన్నారు.

మండల సభ అంటే లెక్కలేదా మీకు..

నేను వచ్చిన గంటకైనా హాజరు కారా..

- అధికారులపై ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఆగ్రహం



సమావేశంలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

కోయిలకొండ, జూన్ 28 : 'మండల సర్వసభ్య సమావేశం అంటే మీకు లెక్కలేదు. మండల సభకు ఎమ్మెల్యే వచ్చిన గంటకైనా హాజరు కారు. ప్రజా సమస్యలను పట్టించుకోరు' అని మండల అధికారులపై నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శశికళ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మండల సమావేశానికి అధికారులు సమయ పాలన లేకుండా సభ ప్రారంభమైన గంటకైనా హాజరు కాకపోవడం దారుణమని ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. మండల సభ అంటే హాజరు వేసుకొనిపోయే విధంగా అధికారులు వ్యవహరించడం సరికాదన్నారు. ప్రజల కోసం పని చేస్తున్నామని ప్రజా సమస్యలు చేర్చించే మండల సమావేశానికి అధికారులు అరగంట ముందు హాజరు కావాలని సూచించారు. ప్రజా సమస్యలు పట్టించుకోకపోతే కఠిన చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని తెలిపారు. విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాలని ఏఓకు సూచించారు. ఉచిత విద్యుత్‌పై విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని విద్యుత్ అధికారులకు తెలిపారు. చివరి మండల సర్వసభ్య సమావేశం సందర్భంగా ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ విజయభాస్కర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణయ్య యాదవ్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ ఖాజ, తహసీల్దార్ భరత్‌గౌడ్, ఎంపీడీవో కాళప్ప, సూపరింటెండెంట్ హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

హోటళ్లలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు



హోటల్ యజమానికి జరిమానా రశీదు అందిస్తున్న దృశ్యం

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), జూన్ 28 : పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లలో జిల్లా ఆహార కల్తీ నియంత్రణ అధికారి మనోజ్‌కుమార్ శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. కొన్నింటిలో బిర్యాని శ్యాంపిళ్లను సేకరించారు. మరికొన్నింటిలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా వంటకాలు చేస్తున్నారని గుర్తించారు. అలాంటి హోటళ్ల యాజమాన్యా లకు జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ తీసుకున్న శ్యాంపిళ్లలో నాసిరకం ఉన్నట్లు తేలితే వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అదేవిధంగా ఎవరైనా సింథటిక్, ఇతర ఫుడ్ కలర్స్ కలిపినా, గడువు తీరిన వాటిని వినియోగించినా వారు జరిమానా, జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిటీ భాగస్వామ్యంతోనే టీబీ నియంత్రణ

జడ్చర్ల, జూన్ 28 : క్షయ వ్యాధి నిర్మూలనలో కమ్యూనిటీ భాగస్వామ్యం ఎంతో అవసరమని టీబీ నివారణ జిల్లా అధికారి డాక్టర్ ఎండీ రఫీక్ అన్నారు. జడ్చర్ల మునిసిపాలిటీ, కావేరమ్మపేటలోని పల్లె దవాఖానాలో శుక్రవారం వివిధ పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు, వివిధ మహిళా సంఘాల మహిళలకు క్షయవ్యాధి లక్షణాలు, గుర్తించే తీరుపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ పొందిన వారంతా తాము పనిచేస్తున్న ప్రాంతంలో కానీ, క్షయ వ్యాధి లక్షణాలు కలిగిన వారు కనిపించిన పక్షంలో పీహెచ్‌సీల వైద్యులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో గంగాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సమత, టీబీ అలెర్ట్ ఇండియా ప్రోగ్రాం మేనేజర్ పురుషోత్తం, గోపాల్, యాసిన్, సత్యప్రసాద్, పంజాబ్ రాష్ట్రంలోని లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ విద్యార్థులు వంశీకృష్ణ, గిరినాయక్, యషాంక్ పాల్గొన్నారు.

సరైన మందులు వాడితే రోగం త్వరగా నయం

భూత్పూర్ : క్షయవ్యాధికి సరైన సమయంలో మందులు వాడితే రోగం త్వరగా నయమవుతుందని మండల వైద్యాధికారి డాక్టర్ సంధ్యాకిరణ్మయి అన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ కృష్ణ ఆదేశం మేరకు శుక్రవారం మండలంలోని తాటిపర్తి గ్రామంలో క్షయవ్యాధి నివారణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అనుమానిత రోగులకు పరీక్షలు నిర్వహించారు. 107 మందికి పరీక్షలు నిర్వహించినట్లుగా ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అబ్దుల్ రబ్, సీహెచ్‌వో ఆయూబ్‌ఖాన్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఓబేద్, రజిత, టీబీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఫొటోగ్రాఫర్స్ సంఘం ఎన్నికలు

మహబూబ్‌నగర్ టౌన్, జూన్ 28 : ఈ నెల 30న మహబూబ్‌నగర్ పట్టణ ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నలిగేశి లక్ష్మీనారాయణ, సయ్యద్ నుస్రత్ తెలిపారు. శుక్రవారం సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే పట్టణ ఎన్నికల నిర్వహణలో భాగంగా గతంలో ఉన్న కమిటీ సమయం పూర్తి అయి పోయినందున మరోసారి ఎన్నికలు నిర్వహిస్తు న్నట్లు చెప్పా రు. లక్ష్మీనగర్ కాలనీలో ఉన్న సంఘం భవనంలో పోలింగ్ ఉంటుందని తెలిపారు. ప్రతీ ఫొటో, వీడియో గ్రాఫర్ ఈ ఎన్నికలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు పట్టణంలో విద్యుత్ కోత

పాలమూరు, జూన్ 28 : పట్టణంలో 132/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో అత్యవసర పనులు చేపడుతుండటంతో నేడు పట్టణంలో ఉదయం 7గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ కోత విధిస్తున్నట్లు ఎస్.ఈ పి.వెంకటరమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పారుపల్లి సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యే గ్రామప్రజలు, అభంగపట్నం సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యే గ్రామ ప్రజల, హన్వాడ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యే గ్రామ ప్రజలు, టంకర సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యే గ్రామాల ప్రజలు, మునిమోక్షం, నవాబ్‌పేట సబ్‌స్టేషన్‌ల నుంచి విద్యుత్ సరఫరా అయ్యే గ్రామాల ప్రజలు, సహకరించాలని కోరారు.

నెంబరు ప్లేటులేని వాహనాలు పోలీస్ స్టేషన్‌కే

- జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి

జడ్చర్ల, జూన్ 28 : నెంబరు ప్లేటు లేని వాహనాలు రోడ్డుపైకి వస్తే ఇక పోలీస్ స్టేషన్‌కే అని జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి హెచ్చరించారు. జడ్చర్ల పట్టణం, జాతీయ రహదారిపై శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్‌లు ద్విచక్రవాహనాలు నడిపితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ద్విచక్రవాహనం నడిపే సందర్భంలో హెల్మెట్ ధరించాలని సూచించారు. లైసెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనానికి ఇన్సూరెన్స్ చేయించి ఉండాలని తెలిపారు. భారీ శబ్దాలు వచ్చేవిధంగా సైలెన్సర్లు అమర్చిన వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

'పెండింగ్ బిల్స్ విడుదల చేయాలి'

పాలమూరు, జూన్ 28 : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ బిల్స్‌ను వెంటనే విడుదల చేయాలని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రాజీవ్‌రెడ్డి, ఆర్.చంద్రానాయక్, కృష్ణమోహన్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రతీనెల ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు వేతనం రావటం సంతోషంగా ఉందన్నారు. కొన్నేళ్లనుంచి పెండింగ్‌లో ఉన్న సరేండర్‌లీవ్స్, టీపీఎఫ్, టీఎస్ జీఎల్ఐ రుణం, 4వ డీఏ, పీఆర్‌సీపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు.

ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలి

- ఎంఈవో కార్యాలయం ముందు ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా

జడ్చర్ల, జూన్ 28 : ప్రైవేట్, కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలల యాజమాన్యాల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జడ్చర్ల మండల విద్యావనరుల కేంద్రం వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. లక్షల రూపాయల ఫీజులను వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని, నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాలలలోనే బుక్స్, యూనిఫాం అమ్ముతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతలేకుండా చూడాలని, మెగా డీఎస్సీ నిర్వహించి 24వేలకుపైగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, రవీంద్ర, మారుతి, నరేశ్‌కుమార్, రాఘవ, అజయ్, నవనీత, శోభ, శృతి, శివరంజని తదితరులు పాల్గొన్నారు.



జడ్చర్ల ఎంఈవో కార్యాలయ అధికారికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు

- టీజీ ఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ పి.వెంకటరమేష్

పాలమూరు, జూన్ 28 : ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పదని టీజీ ఎస్‌పీడీసీఎల్ ఎస్.ఈ. పి.వెంకటరమేష్ అన్నారు. రూరల్ ఏడీ కార్యాలయంలో పనిచేస్తున్న ఆఫీసు సబార్డినేటర్ యం.సత్యమ్మ పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమెను ఎస్.ఈ, డీఈటీ చంద్రమౌళి, డీఈ వెంకటశివరామ్, 1104 యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.సాయిబాబాలు సన్మానించారు. అనంతరం ఎస్.ఈ. మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు అందరు కష్టపడి పని చేయాలన్నారు. కష్టపడి పనిచేస్తేనే సంస్థ మనుగడ ఉంటుందన్నారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందజేయాలన్నారు. ఆఫీసు సబార్డినేటర్ యం.సత్యమ్మ విద్యుత్ సంస్థలో 36ఏళ్లు పని చేసిందన్నారు. కార్యక్రమంలో 1104 యూనియన్ నాయకులు పాండు నాయక్, జి.స్వామి, యాదయ్య గౌడ్, ఈ.శ్రీనివాస్, పెంటయ్య, జి.శేఖర్, కె.శ్రీనివాస్, బి.రవి, యాదయ్య రామరాజు, విజయ్, యం.కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఉద్యోగిని సన్మానిస్తున్న అధికారులు